స్పందన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం

సమస్యలు వింటున్న ఎఎస్‌పి దిలీప్‌కిరణ్

పార్వతీపురం రూరల్ : స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఎఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలోఎస్‌బి సిఐ ఎన్.శ్రీనివాసరావు, డిసిఆర్బి ఎస్ఐ దినకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాపై కేంద్రం నిర్లక్ష్యం

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాపై తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోంది. జిల్లా అభివృద్ధికి తలమానికంగా భావిస్తున్న గిరిజన వర్శిటీ, భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులకు సహకరించడం లేదు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక హోదా మొదలుకుని ప్రత్యేక అభివృద్ధి నిధులకు కూడా ముఖం చాటేస్తోంది. దీనికితోడు 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా సరిగా విడుదల చేయకపోవడం వల్ల స్థానిక సంస్థలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న 2023-24 బడ్జెట్‌లోనైనా కేంద్రం న్యాయం చేస్తుందా? అన్న ఆశతో జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

సిటియు ఏర్పాటు కోసం భూములను పరిశీలిస్తున్న కేంద్రబృందం, జిల్లా ప్రజాప్రతినిధులు (ఫైల్)

- గిరిజన వర్సిటీకి ఏటా కంటితుడుపు కేటాయింపులు
- నిలిచిన అభివృద్ధి పనులు
- అమలుకు నోచుకోని విభజన హామీలు
- ఎయిర్‌పోర్టుకూ సహాయ నిరాకరణ
- రేపు కేంద్ర బడ్జెట్
- ఈసారైనా సహకరించేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఐదేళ్లగా శాశ్వత భవన సముదాయం లేక అద్దె కొంపలో తరగతులు నిర్వహిస్తున్న గిరిజన వర్శిటీకి రూ.1200కోట్లు అవసరం కాగా, ఏటా రూ.22కోట్లకు మించి కేటాయించడం లేదు. ఈ నిధులు వర్శిటీ పరిపాలన, అధ్యాపకులు, సిబ్బంది జీతభత్యాలకే సరిపోతున్నాయి. మరోవైపు స్థల గుర్తింపు పేరుతో సుమారు రెండు దశాబ్దాలపాటు సాగదీసి, సేకరణ పేరుతో కాలక్షేపం చేస్తోంది. భోగాపురంలో తలపెట్టిన ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఆర్థికంగా సాయం చేయాలని కోరుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి నేరుగాను, లిఖిత పూర్వకంగానూ కోరారు. ఇప్పటికీ స్పందన లేదు. ఇటీవల విశాఖ వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ భోగాపురం ఎయిర్‌పోర్టు, గిరిజన వర్శిటీ పనులకు శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆశించినా ఆదిశగా సహకరించలేదు. గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టు చెబుతూనే ఉపాధి హామీ చట్టానికి కేంద్రం తూట్లు పొడుస్తోంది. ఈ పథకం ఉపయోగించుకోవడంలో మన జిల్లా దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఇటువంటి పథకంలో గత ఏడాది రూ.25వేల కోట్ల మేర బడ్జెట్ కేటాయింపు తగ్గించిన విషయం విధితమే. ఇందులో భాగంగా పెట్టిన నిబంధనల వల్ల ఏడాదిగా పనికి తగ్గవేతనాలు రావడం లేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు మంజూరవుతున్న మెటీరియల్ కాంపొనెంట్ నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయడం లేదు. ఏటా వందల కోట్లు వెనక్కిపోతున్నాయి. 2019-20, 2020-21 సంవత్సరాల్లో చేసిన పనికి తగట్టు నిధులు విడుదల చేయలేదు. సుమారు రూ.500కోట్ల వరకు బకాయి చెల్లించాల్సి ఉంది. దీంతో, ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డ కాంట్రాక్టర్లు నిర్మాణాలపై ఆసక్తి చూపడం లేదు. 2020-21లో రూ.211కోట్లు, 2021-22 లో రూ.300కోట్లు చొప్పున కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రద్దయ్యాయి. గత ఏడాది కూడా రూ.290కోట్లు వెనక్కి వెళ్లాయి. అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కుంటుబడుతున్నాయి. జిల్లాకు మంజూరు కావాల్సిన ఎస్‌డిపి (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) నిధులు అక్కరకు చేరలేదు. విజయనగరం ఉమ్మడి జిల్లాకు 5ఏళ్లపాటు ఏటా రూ.50కోట్లు చొప్పున రూ.250కోట్లు మంజూరు చేయాల్సివుండగా విడుదల అరకొరగానే ఉన్నాయి. రూ.170కోట్ల విలువగల పనులు జరగ్గా, రూ.133.5కోట్లు మాత్రమే కేంద్రం విడుదల చేసింది. దీంతో, మిగిలిన రూ.36.5కోట్ల బకాయి ఉంది. రెండేళ్లగా చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చాలా మంది పనులను అర్థాంతరంగా నిలిపివేశారు.

దశాబ్దాల క్రితం నుంచి మోడల్‌గా మారుస్తామన్న విజయనగరం రైల్వే స్టేషన్ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగానే మిగిలింది. కనీసం పడమట దిక్కున మరిన్ని ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల రాకపోకలకు అనువుగా వంతెనలు నిర్మించాలన్న ప్రతిపాదన నెరవేరలేదు. వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్న నిధులు అంకెలు గారడిగానే మిగలడంతో రైతులకు అందే సబ్సిడీ తగ్గిపోయాయి. రైతులు విరివిరిగా వినియోగిస్తున్న ఎరువులు, పురుగు మందులపై సబ్సిడీలు తగ్గించడం లేదా ఎత్తివేయడం వంటివి చేయడంతో పెట్టుబడి భారంగా మారింది. గత బడ్జెట్ సమావేశంలో క్రిమిసంహారక మందుల వినియోగానికి కిసాన్ డ్రోన్లు ప్రవేశపెడతామంటూ బడ్జెట్ ప్రసంగంలో ఊదరగొట్టినప్పటికీ వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, గిట్టుబాటు ధరలు, గొడౌన్లు ఏర్పాటు గురించి పట్టించుకోకపోవడంతో రైతులకు భద్రత లేకుండా పోయింది. ఏటా కోటి ఉద్యోగాలిస్తామన్న కేంద్ర గత రెండేళ్లలో ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదు. ఆదాయ పన్ను పరిమితి పెంచుతారని ఏటా ఎదురు చూస్తున్న ఉద్యోగులకు నిరాశే మిగులుతోంది. సర్వశిక్షాభియాన్, మధ్యాహ్న భోజన పథకం, ఐసిడిఎస్, జాతీయ ఆరోగ్య మిషన్ తదితర పథకాలకు నిధులు పెంచలేదు. కార్మికుల సంక్షేమ నిధిలో విధించిన కోత వల్ల వారికి ప్రభుత్వ సహకారం తగ్గింది. ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు అందని ద్రాక్షగానే మారాయి. పెట్రోల్, డీజిల్‌పై రాయితీలు లేకపోవడం వల్ల రైతులకు మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. విభజన హామీలపై ఎలాంటి చర్చగానీ, కేటాయింపులుగానీ చేయడం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా ఉపశమనం లభిస్తుందని అన్ని రంగాల ప్రజలూ ఎదురు చూస్తున్నారు.

గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ అడుగు జాడలలో జాతి నడవాలని పిలుపు నిచ్చారు. శాంతికి మారుపేరు గాంధీ అని, సత్యాగ్రహం, అహింసా సిద్ధాంతాలతో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారని తెలిపారు. ఆశయ సాధనకు మహాత్మా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని యువత విద్య, ఉద్యోగ రంగాలలో లక్ష్యాన్ని చేరుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరారు.

సాలూరు: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల తహాశీల్దార్ కార్యాలయం ఆవరణలో గల గాంధీ విగ్రహానికి రాజన్నదొరతో పాటు వైసిపి నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు నివాళులర్పించారు.

వీరఘట్టం: నడుకూరు, బొడ్లపాడు గ్రామాల్లో జనసేన నాయకులు ఎం. పుండరీకం, జానీ మహాత్మా గాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో పవన్ సాయి, నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : గాంధీ ఆశయాలకు కొనసాగించేలా ప్రతి ఒక్కరూ చూడాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.జనార్ధన్ నాయుడు గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. వైస్ ప్రిన్సిపల్ ప్రభాకరరావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ జయమణి తదితరులు న్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కురుపాం : మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం గాంధీ చిత్రపటానికి తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గాంధీజీ చనిపోయి నేటికి 75ఏళ్లు గడుస్తున్నా ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జెసి, ఐటిడిఎ పిఒ

జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో....

గుమ్మలక్ష్మీపురం : గరుగుబిల్లి మండలం తోటపల్లిలో జట్టు ట్రస్ట్ కార్యాలయంలో గాంధీకి ఘనంగా నివాళి అర్పించారు. జట్టు ట్రస్ట్ ముఖ్య సలహాదారు, ఫౌండర్ ట్రస్టీ, గాంధీ స్మారక నిధి కన్వీనర్ డాక్టర్ డి.పారినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు, జట్టు సిబ్బంది పాల్గొన్నారు. గాంధీజీ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, భవిష్యత్ తరాలకు నీతి, నిజాయితీలను, నైతిక విలువలు, మానవత్వంతో పాటు పరోపకార గుణాలను వారసత్వంగా అందించాలని, మద్యపానం, ధూమపానం, జూదం వంటి వ్యసనాలకు యువత ఆకర్షించకుండా కాపాడుకోవాలని హితవు పలికారు. స్వచ్ఛమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడే విధంగా సంసిద్ధం చేయాలని ఈ సందర్భంగా డాక్టర్ డి.పారి నాయుడు సూచించారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

చేదోడు లబ్ధిదారులకు రూ.8.19 కోట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద 8193 మందికి రూ.8.19 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేరుగా జమ చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో సోమవారం జరిగిన జగనన్న చేదోడు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య మంత్రి పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో జరిగిన జగనన్న చేదోడు కార్యక్రమం గిరి మిత్ర సమావేశ మందిరంలో స్థానికంగా జరిగింది. ఇందులో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. జిల్లాలో 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో 3036 మంది రజక లబ్దిదారులకు రూ.3.04 కోట్లు, 1150 మంది నాయీ బ్రాహ్మణ లబ్దిదారులకు రూ.1.15 కోట్లు, 4007 మంది దర్జీ లబ్దిదారులకు రూ.4 కోట్లు వెరసి 8193 మంది లబ్దిదారులకు రూ.8.19 కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. లబ్దిదారులకు నమూనా చెక్కులను జిల్లా కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, దాసరి కార్పొరేషన్ చైర్ పర్సన్ రమా దేవి, రజక, తూర్పు కాపు, కూరాకుల, పొందర, తెలుకల, కళింగ వైశ్య కార్పొరేషన్ల డైరెక్టర్లు జనార్ధన్, ఎం.నాగమణి, కె. రమణమ్మ, పి.తిరుపతి, సిహెచ్ వెంకటరమణ, మెహర్ ప్రసాద్, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణ, బిసి కార్పొరేషన్ ఎఇఒ జి.గోపి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చెట్టు కింద చదువులు.. విద్యార్థులకు అవస్థలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో విద్యా ప్రమాణాలు మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని పాలకులు చేస్తున్న ప్రకటనలకు ఆచరణకు ఎంత మాత్రం పొంతన ఉండడంలేదు. దీంతో గిరిజన విద్య అందని ద్రాక్షలా మారింది. వివరాల్లోకి వెళితే...

ఇరిడిలో చెట్టు కింద చదువుతున్న చిన్నారులు

మండలంలోని ఇరిడిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో రేకుల షెడ్డు, చెట్టు కింద విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 57మంది విద్యార్థులు చదువుతుండగా ఒకరు రెగ్యులర్ ఉపాధ్యాయులు, మరొకరు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఉన్న పాఠశాల భవనం శిథిలమై కూలిపోవడంతో వేరే గత్యంతరం లేక సమీపంలోనే చిన్న రేకుల షెడ్డు వేసి తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో కొంతమంది రేకుల షెడ్‌లో, మరి కొంతమంది చెట్టు కింద చదువుతున్నారు. ఇదే సమస్యపై ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు బిడ్డక కొండలరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు, విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చేపట్టేందుకు గుమ్మలక్ష్మీపురంలో ఉన్న ఎంఆర్‌సి భవనానికి బయలుదేరారు. విషయం తెలుసుకున్న ఎంఇఒ నారాయణస్వామి ఇరిడి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. గత 20 ఏళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలకు పక్కాభవనం లేదని ఇలాగైతే చదువులు ఎలా సాగుతాయని గ్రామస్తులు తల్లిదండ్రులు ప్రశ్నించారు. వర్షానికి, ఎండకు, చలికి విద్యార్థులు నానా అవస్థలు పడుతూ చదువుకుంటున్నారని వివరించారు. సమస్యపై స్పందించిన ఎంఇఒ మాట్లాడుతూ రెండో విడత నాడు నేడులో పాఠశాల భవనానికి నిధులు మంజూరైన పనులు సకాలంలో ప్రారంభించకపోవడంతో వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. ఆర్‌బిఐ నుంచి నిధులు వచ్చిన, లేదా పక్క పంచాయతీ నుంచి నిధులతో 15 రోజుల్లోగా భవన నిర్మాణ పనులు ప్రారంభి స్తామని హామీ ఇచ్చారు. 15 రోజుల్లోగా పనులు చేపట్టకపోతే 16వ రోజున ఆందోళన చేస్తామని ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావు హెచ్చరించారు.

గొర్రెలమందపైకి దూసుకెళ్లిన లారీ

60 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని అడ్డూరువానిపాలెం వద్ద అరకు - విశాఖ రోడ్డులో సోమవారం గొర్రెల మందపైకి లారీ దూసుకెళ్లింది. దీంతో 60 గొర్రెలు అక్కడికక్కడే మరణించాయి. మరికొన్ని గొర్రెలు గాయపడ్డాయి. స్థానికుల కథనం ప్రకారం..

లక్కవరపుకోట మండలం కిత్తన్నపేట గ్రామానికి చెందిన దుక్క గంగునాయుడు తన గొర్రెల మందను అనకాపల్లి నుంచి స్వగ్రామానికి తోలుకొని వెళు న్నాడు. లక్కవరపుకోట వైపు నుంచి విశాఖకు వెళుతున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఒక్కసారిగా గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఘటనా స్థలంలో గొర్రెల కళేబరాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అక్కడికక్కడే 60 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరికొన్ని గొర్రెలు తీవ్ర గాయాల పాలయ్యాయి. లారీని ఘటన స్థలంలో విడిచిపెట్టి డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసినట్లు కొత్తవలస పోలీసులు తెలిపారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

ప్రమాద సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలా జరిగిందని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే నష్టపోయిన కాపరికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు, మాజీ ఎంపిపి కొల్లు వెంకటరమణమూర్తి, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపిటిసి మల్ల రామకృష్ణ, సీనియర్ నాయకులు గొంప దుర్గా ఉమేష్, వర్రి రాము పాల్గొన్నారు.

మృతి చెందిన గొర్రెలు

మారుజాతరకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ మారు జాతర సంబంధించిన ఏర్పాట్లను దేవాదాయ శాఖ అధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ముమ్మరంగా చేశారు. మంగళవారం వనంగుడి వద్ద అమ్మవారిని భక్తులు దర్శించుకోను న్నారు. ఈ సందర్భంగా పటిష్ట క్యూ లైన్ ను ఏర్పాటు చేశారు. అలాగే వేప చెట్టుకు కూడా మొక్కులు తీర్చుకోనున్న భక్తుల కోసం పసుపు, కుంకుమ, దీపాలకు సంబంధించిన పూజా సామాగ్రిని అందుబాటులో ఉండేలాగా చర్యలు తీసుకున్నారు. గతవారం కంటే భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున సాలూరు సిఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో ఎస్ఐ పైడ్రాజు పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అలాగే సాలూరు పార్వతీపురం విజయనగరం ఆర్టీసీ డిపోల నుండి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

రబీకి సాగునీరు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

తోటపల్లి కుడి, ఎడమ కాలువల నుంచి రబీ పంటలకు తక్షణమే సాగునీరు విడుదల ఆయన చేయాలని, లేదా పనులైన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గరుగుబిల్లి మండలం ఖడ్గవలస జంక్షన్ వద్ద రబీ పంటకు సాగునీరు విడుదలపై నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి టి.జగదీశ్వరి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ 2019 సంవత్సరం నుంచి కాలువలు ఆధునీకరణ పనులు చేపడుతున్నామని చెప్పి రైతులకు సాగుకు నీరు విడిచిపెట్టడం లేదన్నారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వ రైతులను నడ్డివిరిచిందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో రైతులు కచ్చితంగా ఈ ప్రభుత్వానికి గద్దె దించుతారన్నారు.

ఖడ్గవలస జంక్షన్ వద్ద రాస్తారోకో చేస్తున్న టిడిపి నాయకులు

కార్యక్రమంలో టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, అక్కినేని మధు, గుల్లిపల్లి సుదర్శనరావు, నంగిరెడ్డి మధు, మరడాన పురుషోత్తం, నియోజకవర్గంలో గల టిడిపి నాయకులు, కార్యకర్తలు , రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

మున్సిపల్ సాధారణ సమావేశంలో సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమస్యల పరిష్కరించని సమావేశాలు ఎందుకని మున్సిపల్ అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు అధికారులపై ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ సమావేశం మందిరంలో చైర్పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అరగంట ఆలస్యంగా మొదలైంది. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు హాజరయ్యారు. అజెండాలో పొందుపర్చిన అంశాలను మునిసిపల్ ఉద్యోగి చదివి వినిపిస్తుండగా, అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టణంలో జరగాల్సిన అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అ్న చందంగా ఉన్నాయని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు మున్సిపల్‌చైర్ పర్సన్‌కు, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ప్రతి కౌన్సిల్ సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కాకపోవడమేమిటని, వీటిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని టిడిపి కౌన్సిల్ సభ్యులు కోరాడ నారాయణరావు, బడే గౌరీ నాయుడు, వెంకట్రావు, ఒకటో వార్డు ఇండిపెండెంట్ కౌన్సిల్ సభ్యులు రణభేరి బంగారు నాయుడులు అన్నారు. టిడిపి హయాంలో గత పాలకవర్గంలో ఇళ్లు లేని 435 మంది లబ్ధిదారులు రూ.2 కోట్ల 34 లక్షలు మున్సిపల్ కమిషనర్ అకౌంట్‌కు డిడిలు తీశారని, ఆరేళ్లు కావస్తున్నా ఆ లబ్ధిదారులకు ఇల్లు ఇవ్వలేదు సరి కదా కట్టిన డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వారి డబ్బులు తిరిగి చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఒకటో వార్డు కౌన్సిల్ సభ్యులు కోరగా, లబ్ధిదారులకు డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్థానిక ఎమ్మెల్యేతో పాటు కమిషనర్ తెలిపారు. జిల్లా కేంద్రానికి వివిధ రకాల పనులపై వస్తున్న ప్రజలకు సులభ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు కోరినా స్పందించకపోవడం బాధాకరమని, దీంతో పాటు ఫ్లైఓవర్ పై తరచూ ప్రమాదాల సంభవిస్తున్నప్పటికీ పోలీస్ అధికారులు ప్రమాదాల జరక్కుండా చర్యలు చేపట్టకపోవడం విచారకరమని 8వ వార్డు కౌన్సిలర్ కె.నారాయణరావు అన్నారు. ఈ ఏడాది సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణంలో రహదారుల పక్కన రడీమేడ్ వ్యాపారం చేసుకునే వలస వ్యాపారుల నుంచి ఒక్కో షాపుకు రూ.3000 వరకూ మున్సిపల్ అధికారులు వసూలు చేశారని, దానిపై ఎన్ని షాపుల నుంచి ఎంత వసూలు చేశారు, ఆ మొత్తం ఏం చేశారని ప్రశ్నించారు. పాతబస్టాండ్ రోడ్డు గుంతలు పడి అధ్వాన్నంగా తయారైందని, మున్సిపాలిటీ కార్యాలయం కూడా ఆ ప్రాంతంలో ఉన్నప్పటికీ రోడ్డు మరమ్మత్తులు గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. సమస్యలపై సమావేశాల్లో ప్రశ్నిస్తే అధికార పక్ష సభ్యులు అడ్డుకోవడం దారుణమని అన్నారు. ఒక సందర్భంలో పట్టణ అభివృద్ధిపై అధికార, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకావడంతో చైర్ పర్సన్ ఇరువర్గాలను సముదాయించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యలపై వాగ్వివాదం చేసుకుంటున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలి

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పార్వతీపురం రూరల్ : అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని కేంద్రాలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, లబ్ధిదారులకు వచ్చే పోషకా హారం క్వాలిటీ పెంచాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని అంగనవాడి సెంటర్లో పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని కోరుతూ సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పార్వతీపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పిఒ సుగుణ కుమారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘ కార్యదర్శి ధర్మవతి మాట్లాడుతూ అంగన్వాడీల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికీ జీతాలు వేయలేదని పని భారం పెరిగిందని ప్రభుత్వం వీటికి తోడు ఫేషియల్ యాప్ పెట్టి మరింత ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. సిఐటియు నాయకులు ఇందిర మాట్లాడుతూ అంగన్వాడీలకు సీనియారిటీ ప్రకారం వేతనం ఇవ్వాలని, సూపర్వైజర్ పోస్టులు వయోపరిమితి తొలగించాలని, హెల్పర్స్ ప్రమోషన్స్ వయోపరిమితి 50 సంవత్సరాల పెంచాలని, రాజకీయ జోక్యం నివారించి ప్రమోషన్స్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా బి లక్ష్మి, సెక్టార్ నాయకులు కె.నీలవేణి, గౌరీ, సరస్వతి, సావిత్రి, అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో యువతకు అన్యాయం

సాలూరు : వైసిపి ప్రభుత్వ హయాంలో యువతకు తీరని అన్యాయం జరుగుతోందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి ఆరోపించారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో సంధ్యారాణి మాట్లాడారు. ఈ మూడేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని చెప్పారు. యువత ప్రయోజనాల కోసమే టిడిపి యువనేత నారా లోకేష్ పాదయాత్ర చేపట్టారని చెప్పారు. 130నియోజకవర్గాల్లో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఆయా ప్రాంతానికి లోకేష్ వచ్చినప్పుడు యువకులు ఘనస్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, పాచిపెంట, మక్కువ, మెంటాడ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురంరూరల్ : మండలంలోని తాళ్లబురిడికి చెందిన కుమ్మరి బందను స్థానికంగా కొంతమంది ఆక్రమించుకుంటున్నారని, తక్షణమే విచారణ జరిపి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో జెసి ఆనంద్‌ను కలిసి వినతిని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కుమ్మరిబందపై కొంత మంది స్వార్థపరులు కన్నువేసి రాత్రికి రాత్రి ట్రాక్టర్లతో మన్నువేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వీరికి గ్రామానికి చెందిన రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని, వెంటనే ఈ ఘటనపై అధికారులు విచారణ చేసి ఆక్రమణ దారులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వంగలదాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్

పార్వతీపురంరూరల్ : ఇటీవల ప్రభుత్వంలో బిసి కార్పొరేషన్లకు రెండేళ్లపెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువడించిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్ రంగుమద్ది రమాదేవి సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. తనకు మళ్లీ అవకాశం ఇచ్చినందుకు గాను కృతజ్ఞతలు తెలిపారు.

రైతుకు అందని కెవికె సేవలు

కురుపాం : ఏజెన్సీలోని గిరిజన రైతులకు సేవలందించడమే లక్ష్యంగా ఉండాల్సిన కృషి విజ్ఞాన కేంద్రం సేవలు అందనంత దూరంలో ఉన్నాయని గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం నుంచి ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం వల్ల పరిసర ప్రాంతాల్లోని గిరిజనులకు ఎలాంటి ప్రయోజనం లేదని గిరిజన ప్రాంతంలో ప్రధాన జీవనాధార పంటలైన జీడి, మామిడితో పాటు కంది, పసుపు, రాగులు, జొన్నలు మొదలగు పంటల పైనే గిరిజనులు ఆధారపడి వచ్చిన ఆదాయంతో ఏడాదంతా జీవనం సాగిస్తారన్నారు. అయితే గత రెండేళ్ల నాశనిక రకాల తెగుళ్ల వల్ల పంటలు పూర్తిగా పాడైతే తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలతో పాటు వ్యవసాయానికి ఉపయోగపడే పనిముట్లు ఇవ్వాలి కానీ ఏ ఒక్క గిరిజన రైతుకు ఇచ్చే దాఖలేవని అన్నారు. కావున వీటిపై ఉన్నతాధికారులు స్పందించి దర్యాప్తు చేసి కెవికె సేవలు గిరిజనులకు అందుబాటులో తేవాలని కోరారు.

లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా ప్రత్యేక పూజలు

కురుపాం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు విశేష స్పందన వస్తూ యువత, మహిళలు పెద్ద ఎత్తున అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ టి.జగదీశ్వరి అన్నారు. సోమవారం మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో దూలికేశ్వర ఆలయంలో లోకేష్ పాదయాత్ర విజయవంతం అవ్వాలని నిర్వహించిన ప్రత్యేక పూజలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలు, యువతకు జరుగుతున్న అన్యాయం ప్రశ్నించడానికే యువగళం పాదయాత్ర అని రాష్ట్రానికి చెందిన నిరుద్యోగ యువత పక్క రాష్ట్రాల వైపు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందివాడ కృష్ణబాబు, కన్నా, కలిశెట్టి శ్రీను, చంటి, సాయి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో టిడ్కో గృహ ప్రవేశాలు

సాలూరు : పట్టణంలో పేదలకు సంబంధించిన టిడ్కో గృహ ప్రవేశాలు వచ్చేనెల మొదటి వారంలో నిర్వహించనున్నట్లు ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ చెప్పారు. సోమవారం ఆయన చంద్రప్పవలసలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. మార్చి 15నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆరోవార్డులో పర్యటించిన డిప్యూటీ సీఎం రాజన్నదొరకుకొంతమంది లబ్దిదారులు టిడ్కో ఇళ్ల గురించి అడగ్గా ఆయన టిడ్కో ఎమ్‌డితో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, లబ్దిదారులకు పంపిణీ చేయాలని రాజన్నదొర ఆదేశించడంతో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ టిడ్కో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట టిడ్కో ఇఇ జ్యోతి, డిఇ బాలకృష్ణ, అధికారులు సన్యాసప్పడు, ప్రవీణ్ ఉన్నారు.

ఆర్‌బికెల పరిశీలన

సీతానగరం : మండలంలోని పెదబోగిలి, బుడ్డిపేట రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఎంపిడిఒ బి. కృష్ణమహేశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు వద్దనున్న ధాన్యం బస్తాలు ఎంతవరకు ఉన్నాయి? కళ్లాలు, పొలాల్లో వరిచేను కుప్పలు ఆయా గ్రామాల్లో ఉండే రైతుల వివరాలను సేకరించి అనంతరం ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలోనూ రైతుల వివరాలను సేకరించి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 6న ధర్నా

పాచిపెంట : అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికై ఫిబ్రవరి 6న పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ధర్నా చేపడతామని పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి టి.ప్రభావతి అన్నారు. ఈ ధర్నాకు అంగన్వాడీ కార్యకర్తలకు సామూహిక సెలవు ఇవ్వాలని కోరుతూ సోమవారం సిడిపిఒ బి. అనంతలక్ష్మికు వినతి పత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ ఐటిడిఎ పిఒ, జిల్లా కలెక్టర్‌కు ఆ రోజు వినతి పత్రాలు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఇఒ సంఘం డైరీ ఆవిష్కరణ

కలెక్టరేట్ : వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం డైరీని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ చేతులు మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారుల సేవలను ఆయన కొనియాడారు. ఏటా వ్యవసాయ సమాచారిని పేరుతో సంఘం డైరీ ఆవిష్కరణ చాలా సంతోషమని, ఈ డైరీలో అన్ని రకాల సమాచారం ఉండడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నాయకులు ఎం. బాబ్జి, యు.శ్రావణ్ కుమార్, డి.సూర్య నారాయణ, విస్తరణాధికారులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో రెవెన్యూ, సచివాలయాల అడ్మిన్లు

పార్వతీపురం టౌన్ : 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ పరిధిలో ఉన్న ఇంటి, ఖాళీ స్థలాల పన్నులు, వాణిజ్య సముదాయాల పన్నుల వసూళ్లపై మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు ఆదేశాల మేరకు మున్సిపల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, ఈ నారాయణరావు, జి. వినయ్ కుమార్, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు సోమవారం ముమ్మరంగా పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. పన్నులు చెల్లించేందుకు స్థానిక ప్రజలు కూడా చొరవ చూపించడంతో ఏడాది లక్ష్యాన్ని చేరుకుంటామని మున్సిపల్ రెవిన్యూ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

స్పందనకు 96 వినతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఒ.ఆనంద్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్ స్పందన కార్యక్రమంలో ప్రజలనుండి అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై 96 అర్జీలు అందజేశారు. స్వీకరించిన వినతుల్లో కొన్ని...
మక్కువ మండలం సీబిల్లివలసకి చెందిన పి.తిరుపతిరావు తమ గ్రామం నుంచి దీరడవలస మధ్య గల రోడ్డులో కల్వర్టు నిర్మించామని, బిల్లులు వెంటనే మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. భామిని మండలం మనముకొండకు చెందిన ఎన్.అన్నయ్య, ఇతరులు 20ఏళ్లుగా ఈ గ్రామంలో నివసిస్తున్నామని, సర్వేనంబర్ 57-1 లో 14.96 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని, ఆ భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. పార్వతీపురం మండలం నర్సిపురానికి చెందిన సిహెచ్.కృష్ణమ్మ, గ్రామస్తులు సాగు చేస్తున్న భూమికి సంబంధించిన డి-పట్టాలకు రుణాలు ఇప్పించాలని కోరారు. పార్వతీపురం మండలం దాలినాయుడువలసకు చెందిన డి.హైమావతి, గ్రామస్తులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని అర్జీ అందజేశారు. సాలూరు మండలం దళాయివలసకు చెందిన ఎం.కామయ్య, 17 మంది ఇతర రైతులు త్రీఫేస్ కరెంట్ లైన్,కొత్త వ్యవసాయ బోర్లు నిమిత్తం సబ్సిడీ రాయితీని మంజూరు చేయాలని కోరారు. భామిని మండలం కొరమ గ్రామానికి చెందిన బి.సరోజినీ 20ఏళ్లుగా సర్వే నెంబర్ 524/11 లో ఎకరం భూమినిసాగు చేసుకుంటున్నామని, రెవెన్యూ అధికారులు సర్వే చేశారని, కానీ సర్వేనెంబర్ 525/11గా మార్చి పట్టా ఇచ్చారని, తప్పును సవరించి పట్టాను మంజూరు చేయాలని కోరారు. గరుగుబిల్లికి చెందిన కె.తవిటయ్య తన కుమార్తె మూడో తరగతి చదువుతుందని, తనకు అమ్మఒడి డబ్బులు జమ కావడం లేదని, సమస్యను పరిష్కరించాలని దరఖాస్తు అందజేశారు. పాచిపెంట మండలం గోగాడవలసకు చెందిన జి.సూర్యనారాయణ కిరాణా షాపుకు సబ్సిడీ రుణం మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురానికి చెందిన జి.పార్వతి తన పాతసదరం ఐడిని రద్దు చేసి కొత్త సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. కొమరాడ మండలం సివికి చెందిన టి.గుంపయ్య తనకి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

పార్వతీపురం: వినతులు స్వీకరిస్తున్న జెసి ఆనంద్

విభిన్న ప్రతిభావంతుల నుంచి 5 వినతులు

విభిన్న ప్రతిభావంతులకు కలెక్టరేట్ సెల్లార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పందన కార్యక్రమం జరిగింది. సీతానగరం మండలం పెద్దఅంకులం గ్రామానికి చెందిన గొట్టాపు సింహాచలానికి జాయింటు కలెక్టరు ఒ.ఆనంద్ ఊతకర్రలు అందజేశారు. స్పందనలో విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలపై ఐదు వినతులు అందాయి. వీటిలో...
సీతానగరానికి చెందిన గొట్టపు సింహాచలం ఉతకర్రలు కావాలని, అంబటి సత్యనారాయణ హియరింగ్ ఎయిడ్ మంజూరు చేయాలని, ఆకుల రజని ట్రై సైకిల్ మంజూరు చేయాలని, కొమరాడకు చెందిన మరడాన సాయికుమార్ లాప్‌టాప్ కోసం, పార్వతీపురానికి చెందిన గుర్రెడ్డిరామారావు ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో వివిధశాఖలకు చెందిన పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ ఫీజులు వసూలుపై చర్యలు చేపట్టండి

పార్వతీపురం టౌన్ : చట్టవ్యతిరేకంగా టోల్ గేట్ ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరం మండలం గుచ్చిమి, జోగింపేట గ్రామాలకు దగ్గర్లో ఒక ప్రవేటు వ్యక్తి కొంతస్థలంలో సిమ్మింగ్ ఫూల్ రైన్ డాన్స్ కొన్నిగదులను నిర్మాణాలు చేసి అక్రమంగా ఆనందం అనేవాటికి అక్కడికి వెళ్లే వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఆ దగ్గరలోనే ప్రవేటు వారి రిసార్ట్ ఉన్నాయి, వృక్షాలు స్థలాలు, ప్రభుత్వభూములు ఉన్నాయని అన్నారు. లోపలికి వెళ్లాలంటే టోల్‌గేట్ రూ.20 ప్రవేశ రుసుం వసూలు చేస్తున్నారన్నారు. ఆనందం కోసం ఏర్పాటు చేసుకున్న స్థలానికి చట్టబద్ధత ఉంటే చుట్టూ కంచెవేసుకొని వారి స్థలానికి టోల్ గేటు పెట్టుకొని ఎంట్రీఫీజు వసూలు చేసుకుంటే తప్పేమిలేదన్నారు. కానీ ప్రభుత్వభూములకు, ప్రవేటువ్యక్తుల ఆస్తులకు వెళ్లే మార్గానికి టోల్‌గేటు పెట్టడం సమజసం కాదని అన్నారు. పైగా ఆ ప్రాంతంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ భూములు ఆక్రమణ చేశారని వదంతులు ఉన్నాయి. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు.

సీతంపేట: సమస్యలను వింటున్న పిఒ బి. నవ్య

సమస్యలను పరిష్కరించండి : పిఒ

సీతంపేట : సమస్యలను పరిష్కరించాలని స్పందనలో సోమవారం పలువురు వినతులను అందించారు. ఐటిడిఎలో పిఒ నవ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనలో జగతపల్లి గ్రామానికి చెందిన సవర మోనిక సిసి రోడ్డు మంజూరు చేయాలని వినతినిచ్చారు. సవరఉద్దలీ గ్రామానికి చెందిన సవర కావేరి తాగునీటి సదుపాయం కల్పించాలని, వలగెడ్డ గ్రామానికి చెందిన హిమరక ఆదిలక్ష్మి డ్రైనేజీ కాలువలు మంజూరు చేయాలని, బెన్నడు గూడకు చెందిన లక్ష్మినారాయణ సిసి రోడ్డు మంజూరు చేయాలని, కొండ గ్రామానికి చెందిన కృష్ణారావు వీధి కాలువలు మంజూరు చేయాలని, కుసుమూరుకు చెందిన ఆనందరావు చెరువులో పూడికలు తీయాలని స్పందనలో వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి. మురళీ, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, సిడిపిఒ రంగలక్ష్మి, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంఛార్జ్ జాకబ్ దయానందర్, ఒఎస్‌డి యుగంధర్, ఎఎంఒ పి. కోటిబాబు పాల్గొన్నారు.

వాడీవేడిగా నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి- పాలకొండ

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సోమవారం చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. కౌన్సిలర్లు సమస్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవలే నగర పంచాయతీ మొబైల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందిన విషయాన్ని కౌన్సిలర్లు ప్రస్తావించారు. నగర పంచాయతీ వాహనాలకు ఇన్సూరెన్స్‌లు ఉన్నాయా లేదా అంటూ కైన్సిలర్లు వెలమల మన్మధరావు, కిల్లారి మోహనరావు తదితరులు ప్రశ్నించారు. లేవని చెప్పడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారని కనీసం వాహనాలకు బీమా కూడా చేయించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. 4వ వార్డు పరిధిలో రహదారికి సుమారు రూ.7.50 లక్షలు ఎమ్మెల్యే సూచనలపై కేటాయించడాన్ని కౌన్సిలర్లు తప్పుపట్టారు. ఆ ఒక్క వార్డులోనే సమస్యలున్నాయా అంటూ నిలదీశారు. ఎమ్మెల్యే ఆ వార్డుకే కాదని, నగర పంచాయతీలో అన్ని వార్డులకు ఆమె ఎమ్మెల్యే అని కౌన్సిలర్లు ఎద్దేవా చేశారు. 11వ వార్డులో పైపులైన్లు పనులకు నిధులు కేటాయించడాన్ని కౌన్సిలర్లు అడ్డు తగిలారు. నాన్ అమృత పథకం కింద కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తుంటే మరలా ఈ పైపులైన్లకు నిధులు ఎందుకు కేటాయించాలని ప్రశ్నించారు. దీనిపై వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు కలుగజేసుకుని నాన్ అమృత పథకం పూర్తిగా అమల్లోకి వచ్చేసరికి ఆలస్యమవుతుందని అంతవరకు ఇబ్బందులు లేకుండా నిధులు కేటాయించడం జరిగిందని చెప్పారు. పాలథిన్ నిషేదం సక్రమంగా అమలవ్వడం లేదని 14వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి సభ దృష్టికి తీసుకురాగా కమిషనర్ సర్వేశ్వరరావు కలుగజేసుకుని దీనిపై ప్రత్యేక దృష్టి పెడతానని పట్టణంలో ఎక్కడా పాలథిన్ వినియోగం లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు గంగునాయుడు, దుప్పాడ పాపినాయుడు, భాసూరు కాంతారావు తదితరులున్నారు.

సభ్యులను సముదాయిస్తున్న వైస్ చైర్మన్ హనుమంతురావు

ఘనంగా మరియగిరి యాత్ర

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు. వెంకంపేట పంచాయతీ పరిధి కొండపైన సోమవారం మరియగిరి యాత్ర స్థానిక ఫాదర్ డేవిడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల కార్డినల్ బిషప్ హైదరాబాదుకు చెందిన మహా పిఠాధిపతి పూల ఆంటోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యాత్రకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది కట్టు దిట్టమైన ఏర్పాటు చేశారు. ఈ యాత్రకు సుమారు లక్షమంది భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మరియగిరి యాత్రకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం డయాసిస్ బిస్పా రాయరాల విజయ్ కుమార్, వివిధ ప్రాంతాల నుండి ఫాదర్లు పాల్గొన్నారు.

యాత్రలో పాల్గొన్న భక్తులు

వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి -భామిని

గెల్లంకి రమేష్

స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (పిఎసిఎస్)లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28లోగా 4శాతం వడ్డీ చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు గెల్లంకి రమేష్ తెలిపారు. సోమవారం భామిని కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా రుణాలు రెన్యూవల్ చేస్తేనే ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీ లభిస్తుందన్నారు. 4శాతం వడ్డీతో పాటు పాస్ బుక్, ఆధార్ జెరాక్స్, ఒరిజినల్ 1బి, పాస్ ఫోటోతో పిఎసిఎస్‌కు రావాలన్నారు. గడువు తీరిన తరువాత రుణాలు రెన్యూవల్ చేయాలంటే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. ఇది అదనపు భారం అవుతుందని తెలిపారు. ఆయనతో పాటు పిఎసిఎస్ సిఇఒ సన్యాసి రావు వున్నారు.

బాధ్యతగా పనిచేయండి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. సోమవారం పట్టణంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. లైబ్రరీ, మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టీతో పాటు పలు రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చక్కగా చదువుకుని ఉన్నత విద్యావంతులు కావాలన్నారు.

లైబ్రరీని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

త్వరలో పనులు ప్రారంభిస్తాం

వీరఘట్టం : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ జెఇ జగన్మోహన్ రాజ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రానికి సమీపంలోనే కుంభీడి గెడ్డ వద్ద వంతెనను ఆయన సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఈ వంతెన వద్ద ప్రధాన మలుపు కావడంతో ఎటువంటి ఆనవాళ్ళు లేకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వీటిని దృష్టిలో పెట్టుకుని ఒకవైపు రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. వీటితోపాటు నాలుగు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన మలుపు కావడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కుష్టు వ్యాధి గుర్తింపుపై అవగాహన

ప్రజాశక్తి- సీతానగరం

కుష్టు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని బూర్జ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో వైద్య సిబ్బంది నిర్వహించిన స్పర్శ - కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. కుష్టు వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలనలో భాగంగా ఈనెల 30 నుంచి వచ్చే ఫిబ్రవరి13 వరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కుష్టు వ్యాధి ముఖ్యంగా దగ్గు, తుమ్ముల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. కొన్ని ప్రాథమిక లక్షణాల ద్వారా ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి, చికిత్స ఇవ్వడం ద్వారా కుష్టు వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని సూచించారు. చర్మంపై స్పర్శ లేని పాలిపోయిన, ఎరుపు రంగు మచ్చలు, నూనె రాసినట్లు మెరుస్తూ కొంచెం దళసరిగా ఉన్న చర్మం, చేతులు, పాదాలు, నరాలు తిమ్మిర్లుగా అనిపించడం, చెవి తమ్మెలు మందంగా మారిపోవడం, కను బొమ్మలు, వెంట్రుకలు రాలిపోవడం, చల్లని, వేడి వస్తువుల స్పర్శ తెలియకపోవడం, చర్మంపై ముఖ్యంగా వీపు, కాళ్లు, చేతులపై గుత్తులుగా కాయలు ఏర్పడడం మొదలగు లక్షణాల ద్వారా గుర్తించవచ్చని అన్నారు. అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు ఇస్తున్నామని, పలు అంశాలపై డాక్టర్ జగన్మోహన్ అవగాహన కల్పించి సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు రక్తహీనత, వాటి నివారణా చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి , ప్రధానోపాధ్యాయులు ఎం.సన్యాసినాయుడు, సూపర్ వైజర్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సీతానగరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సమక్షంలో స్థానిక వైద్యాధికారి శిరీష విద్యార్థులకు లెప్రసీపై అవగాహన కల్పించారు. అనంతరం హడ్కో కాలనీలో కుష్టి వ్యాధిపై ర్యాలీ నిర్వహించి ప్రజలందరికీ సవివరంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు..

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్యులు

పట్టణంలో గడపగడపకు..

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ఆరో వార్డు గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగన్ సిఎం కావాలని చెప్పారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. పట్టణంలో రోడ్లు,కాలువల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి,పట్టణ మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్ లు జర్జాపు నీలిమ, గిరిరఘు, గొర్లి వెంకటరమణ పప్పల లక్ష్మణరావు, శ్యామలాంబ కోపరేటివ్ స్టోర్స్ చైర్మన్ మేడిశెట్టి అప్పలనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, కమిషనర్ శంకరరావు,ఎఇ సూరి నాయుడు పాల్గొన్నారు.

సమస్యను వింటున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఏనుగుల కదలికల పరిశీలన

అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - భామిని

మండల ంలోని దిమ్మిడిజోల గ్రామ సమీపంలో వంశధార కుడి కాలువ ఎగువున మామిడి తోట, చెరకు పొలాలు సమీపంలో సంచరిస్తున్న 4 ఏనుగుల గుంపును వైసిపి నాయకులు తోట సింహాచలం సోమవారం పరిశీలించారు. ఫారెస్ట్ సిబ్బంది ఎలిఫెంట్ మూవ్ మెంట్ డ్రైవ్ ఎలా చేపడుతున్నారు.? వ్యవసాయ క్షేత్రలలో తిరిగే రైతులకు ప్రాణహాని జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? ఏనుగులును ఈ ప్రాంతం నుంచి పూర్తిగా తరలించే అవకాశాలపై ఫారెస్ట్ సిబ్బందిని ప్రశ్నించారు. ఏనుగులను తరలించి జూలో పెట్టే అవకాసం లేదని, గతంలో మత్తు మందు ఇచ్చి తరలింపు చేపట్టేటప్పుడు మందు వికటించి ఏనుగు చనిపోవటంతో ఆ ప్రక్రియ నిలిపివేశామని, ఏనుగులు తరలింపు పై ఒరిస్సా గవర్నమెంట్ స్టే వుందని, ఒరిస్సా తరలిద్దా మంటే ఒరిస్సా ఫారెస్ట్ సిబ్బంది అడ్డుకుంటున్నారని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం ఏనుగులను 30 మంది అటవీ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, దశలు వారీగా వేరే ప్రాంతానికి ఎలిఫెంట్ మూవ్మెంట్ డ్రైవ్ ద్వారా సహజంగా తరలిస్తున్నామని, ఈ ఏరియా లో మైదాన ప్రాంతాలలో చెరకు, మొక్కజొన్న, అరటి పంటలు, నీటి సదుపాయం ఉండటం ఈ ప్రాంతంలో సంచరించడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నాయని, స్థానికులు, వ్యవసాయ క్షేత్రలకు వెళ్లే వారికి ఎటువంటి నష్టం జరగకుండా నిరంతరం అప్రమత్తం చేస్తున్నా మని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నిబ్రం, కాగితపల్లి క్రిష్ణ, జి. మోహన్, రవణ, స్థానికులు వున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీతంపేట: కొత్తూరు గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ బాలురు ఒకే మోటరు బైక్‌పై సోమవారం సీతంపేట పార్క్ కి వచ్చి తిరిగి కొత్తూరు వెళుతుండగా ఐటిడిఎ జంక్షన్ వద్దకు చేరేసరికి ద్విచక్ర వాహనం అదుపు తప్పి బైక్ బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న సొండి అవినాష్, వెనుక కూర్చున్న ఇద్దరు మైనర్ బాలురు రోడ్డుపై పడి గాయాలపాలైయ్యారు. ఈ సంఘటనపై సీతంపేట హెడ్ కానిస్టేబుల్ సుందర్ రావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మైనర్లకు వాహనాన్ని ఇచ్చిన తన పెదనాన్న దేవులపల్లి అప్పన్న పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కురుపాం : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం కురుపాం సమీపంలో గల టేఖరకండి వద్ద జరిగింది. స్థానికుల అందించిన సమాచారం ప్రకారం కురుపాం గ్రామానికి చెందిన వి.సత్యనా రాయణ (59) రావాడ నుండి కురుపాం బైక్‌పై వస్తుండగా టేఖరకండి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంతద్రానికి తరలించగా వైద్యాధికారి ప్రాథమిక చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

2400 సారా ప్యాకెట్లు స్వాధీనం

పాచిపెంట: స్థానిక నడిపల్లి వీధి, ఇరుకు వీధిలలో నాటుసారా అమ్మకదారులను పాచిపెంట, సాలూరు రూరల్, మక్కువ ఎస్ఐలు, ఎస్ఇబి ఎస్ఐ, పోలీసు సిబ్బందితో సోమవారం పట్టుకున్నారు. ఆ గ్రామానికి చెందిన చల్లా నూకరాజు, భోను గంగరాజు, యడ్ల వెంకటమ్మ, చల్లా సత్యవతి, సామ వీరా స్వామిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి మొత్తం 12 బస్తాలలో 2400 నాటుసారా పాకెట్లు (240 లీటర్లు) స్వాధీన పరచుకుని వారిని రిమాండ్‌కి తరలించారు.

పట్టుబడిన సారాతో పోలీసులు